క్లుప్తంగా

సీతారాములకు గ్రామోత్సవం

కొండాపురం: మండలంలోని కొమ్మి గ్రామంలో శ్రీసీతారాముల తిరునాళ్లలో భాగంగా మూడో రోజు మంగళవారం స్వామివారికి గరుడ వాహనసేవ నిర్వహించారు. ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సీతారాములను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. నిర్వాహకులు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి సీతారాముల ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సీతారాముల గ్రామోత్సవానికి కుమ్మరి వంశస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు

వరికుంటపాడు: వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో మే ఒకటో తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపునకు భవిత కేంద్రాల్లో పనిచేసే ఐఈఆర్టీలు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో వరికుంటపాడు మండలంలో 13 మంది, ఉదయగిరి మండలంలో 20 మంది ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి జాబితాను ఎంఈఓల ద్వారా సమగ్రశిక్ష జిల్లా అధికారులకు పంపారు. వీరికి మండల కేంద్రాల్లోని భవితా కేంద్రాల్లో విద్యనందిస్తారు. ఈ సర్వేలో ఐఈఆర్టీలు కె.కుమార్, సీహెచ్ అన్వేష్, శివనందిని, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఉదయగిరి: వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఎం.శివకల్పన అన్నారు. ఆమె మంగళవారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రం భవనంలో సిబ్బందితో ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయాలన్నారు. ఎప్పటికప్పుడు గర్భిణుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సీహెచ్‌ఓ శివకుమారి, హెచ్ఈ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నయ్య, అంకమ్మ పాల్గొన్నారు.

డైరెక్టర్ పదవికి రాజీనామా


అల్లూరురాజు

సీతారామపురం: రాష్ట్ర భట్రాజు డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి సీతారామపురం బిట్–1 ఎంపీటీసీ సభ్యుడు పీసీ అల్లూరురాజు మంగళవారం రాజీనామా చేశారు.

పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు



సంగం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు మంగళవారం పాఠ్యపుస్తకాలు చేరాయి. జూన్ 13వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ముందస్తుగా పాఠ్యపుస్తకాలు పాఠశాలకు తరలించారు. అందులో భాగంగా సంగం మండలంలోని అన్ని పాఠశాలలకు సంబంధించి మొదటి విడతలో 10,811, రెండో విడతలో 5,786 పాఠ్యపుస్తకాలు ఆయా పాఠశాలలకు చేరాయి.

23 నుంచి పోలేరమ్మ తిరునాళ్లు

వరికుంటపాడు: మండలంలోని కొండ్రాజుపల్లెలో గ్రామదేవత శ్రీపోలేరమ్మ తిరునాళ్లు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న పోలేరమ్మతల్లి నిలుపు, 24న అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు, గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, 25న బండ్లు పొంగళ్లు, డీజే నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

సోమశిల: అనంతసాగరం మండలంలోని సోమశిల పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షం నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి

- మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీలు
- పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్న వైద్యులు

దుత్తలూరు: మలేరియా నివారణపై ప్రతి ఒక్కరూ సారించాలని, తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధి దరిచేరదని కావలి డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రిజిత పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం దుత్తలూరు పీహెచ్‌సీ పరిధిలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలు చేరకుండా మురుగునీటిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అంతకుముందు వైద్యశాలలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల సంఖ్యను పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అడల్ట్ బీసీజీ టీకాలు వేయాలన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌పై ఆశా కార్యకర్తలకు వివరించి గ్రామాల్లో లబ్ధిదారులు వీటిని ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఓంకారయ్య, ఎస్‌యూఓ నౌషాద్, హెచ్ఈ బీబీజాన్, సూపర్‌వైజర్లు ఖాజామొహిద్దీన్, అరుణకుమారి, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

దోమల నివారణపై దృష్టి

కలిగిరి: ప్రతి ఒక్కరూ దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి తెలిపారు. కలిగిరిలోని ప్రాథమిక


కలిగిరి: పీహెచ్‌సీ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యసిబ్బంది

ఆరోగ్య కేంద్రం నుంచి మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'దోమ పుట్టకూడదు – దోమ కుట్టకూడదు' అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యపరీక్షలు చేయించుకుని తగిన చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోండి

ఆత్మకూరురూరల్: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మురుగునీరు నిల్వ ఉన్న చోట మలేరియా జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డీజే దేవానంద్ పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మహిమలూరులో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలతో కలిసి మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవానంద్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంట్లోని పాత్రలన్నింటినీ శుభ్రపరిచి నీటి నిల్వలు తొలగించడం ద్వారా మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని, శుభ్రమైన పాత్రలో ఆహార పదార్థాలను వండి వేడివేడిగా తినాలని సూచించారు. ఎవరైనా రెండు రోజులకు మించి జ్వరంతో బాధపడుతుంటే వెంటనే పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ఖాదర్‌బాషా, పీహెచ్‌ఓ సుగుణ, పీహెచ్‌ఎన్ శైలజ, ఎంపీహెచ్‌ఎస్ సైదా, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరురూరల్: మహిమలూరులో..

అప్రమత్తంగా ఉండండి

ఆత్మకూరు: మలేరియా వ్యాప్తిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకుంటే జ్వరాల బారిన పడకుండా తప్పించుకోవచ్చని ఆత్మకూరు పట్టణ హెల్త్ క్లినిక్ వైద్యాధికారిణి అస్మా అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను ఆత్మకూరులోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అస్మా మాట్లాడుతూ శుద్ధమైన నీరు తాగాలని ప్రజలకు సూచించారు. తొలకరి వర్షాలు కురుస్తున్న క్రమంలో కొన్ని ప్రాంతాల్లో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, అలాంటి చోట్ల నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సుధాకర్, ఆయుష్ వైద్యాధికారి అబ్దుర్ రజాక్, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు

వరికుంటపాడు: మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి కరిష్మా మాట్లాడుతూ మలేరియా దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని, దోమలు ఉత్పత్తికాకుండా ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న దృష్ట్యా మురుగు, వర్షపునీరు ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.


దుత్తలూరు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



ఆత్మకూరు పట్టణంలో..


వరికుంటపాడు: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మొక్కలు నాటిన పూర్వ విద్యార్థులు

కావలి: స్థానిక విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో 1976 నుంచి 1981 వరకు చదివిన విద్యార్థులు మంగళవారం ఆ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పూర్వ విద్యార్థి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పల్లెబోయిన మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ద్వారకానాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని పూర్వ విద్యార్థులను అభినందించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ కావలి పట్టణమంతా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రోసిరెడ్డి, సాయి, రియాజ్, మాలకొండలరావు, శివకుమార్, రాజశేఖర్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు

ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు

ఉదయగిరి: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు వి.బాలకేశవులు, శివరామిరెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీ బృందం ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్న వసతులు, సౌకర్యాలు, బోధనా సిబ్బంది అర్హతలు, పాఠశాల వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.


రికార్డులు పరిశీలిస్తున్న తనిఖీ బృందం

మెరుగైన వైద్యసేవలు అందించాలి

వరికుంటపాడు: క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు బాధ్యతగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని మండల వైద్యాధికారిణి కరిష్మా పేర్కొన్నారు. ఆమె మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలు, రికార్డులు సక్రమంగా నిర్వహించడంతో పాటు, నెలసరి నివేదికలు సకాలంలో అందించాలని తెలిపారు. కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలన్నారు. గర్భిణుల ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని, గిరిజన కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించి రక్తహీనత ఉన్న వారిని గుర్తించి సేవలందించాలని తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు మాట్లాడుతూ మలేరియా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.


మాట్లాడుతున్న సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు

డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి

సీతారామపురం: వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా ఆశా కార్యకర్తలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారిణి స్వప్నారెడ్డి సూచించారు. ఆమె మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తగిన మోతాదులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. అలాగే అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి కేటాయించిన లక్ష్యాలు అధిగమించాలన్నారు. గర్భిణులు 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు వైద్యురాలు భవ్యశ్రీ, ఎంపీహెచ్ఈఓ మజీద్, పీహెచ్‌ఎన్ కృష్ణమ్మ, ఎంపీహెచ్ఎస్ రియాజ్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ నూతన మేనేజర్‌గా మున్వర్



ఆత్మకూరు: ఆత్మకూరు స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ నూతన మేనేజర్‌గా షేక్ మహమ్మద్ మున్వర్ తన చాంబర్‌లో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న మేనేజర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో కందుకూరు బ్రాంచ్‌లో పనిచేస్తున్న మహమ్మద్ మున్వర్ బదిలీపై వచ్చినట్లు తెలిపారు. బ్యాంకు పరిధిలోని ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు సిబ్బందితో కలిసి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

18 నుంచి పొగాకు ముక్క, బిట్స్ వేలం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో ఈ నెల 18వ తేదీ నుంచి పొగాకు ముక్క, బిట్స్ వేలం నిర్వహించనున్నట్లు వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పొగాకు బోర్డు ఇచ్చిన బేల్ పట్టాలతో బేళ్లు కట్టాలని, తూకం 150 కిలోలకు మించరాదని తెలిపారు. 2024వ సంవత్సరం పొగాకు సూర కోటా 500 కిలోలుగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇది రెగ్యులర్ కోటాలో కలవదని, ఇది పూర్తి అదనపు కోటాగా పరిగణించనున్నట్లు తెలిపారు. పొగాకు ముక్కను ఒక బ్యారెన్‌కు 3 బేళ్ల చొప్పున అమ్ముకోవచ్చని సూచించారు. పొగాకు సూర అమ్ముకోవాల్సిన రైతులు తమ వద్దనున్న పొగాకు ముక్క బేళ్ల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఫరూఖ్‌అలీకి నివాళి


మాట్లాడుతున్న జేవీవీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి

ఉదయగిరి: జనవిజ్ఞాన వేదిక నాయకుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి, ఉపాధ్యాయుడు దివంగత ఫారుఖ్‌అలీ లేని లోటు తీరనిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక షాదీమంజిల్‌లో గాజుల ఫారుఖ్‌అలీకి జేవీవీ ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్యక్రమంలో జేవీవీ నాయకులు కె.శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిఅహ్మద్, జి.వెంకటేశ్వరరావు, గాజుల తాజుద్దీన్, కాకు వెంకటయ్య, ఫర్దిన్‌బాషా, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి

అల్లూరు: స్థానిక కోనేరు సెంటర్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహిస్తున్న హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీని గ్రామస్తులు విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు మంగళవారం కోరారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు కోనేరు సెంటర్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై పేటసత్రం వరకు వెళ్లి తిరిగి కోనేటి సత్రానికి చేరుకుంటుందని తెలిపారు. 13వ తేదీన వార్షికోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బ్రహ్మానందం, పి.కమలాకర్, కార్తీక్‌శర్మ, నారాయణస్వామి, పి.శ్రీనివాసులు, శివ, కల్యాణ్, పోలయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

తాగునీటికి తిప్పలు

సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి ఎస్సీకాలనీలో తాగునీటి కోసం కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలనీలోని తాగునీటి పథకం చెడిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తెలిపారు. సుమారు 120 కుటుంబాలు 300 జనాభా కలిగిన ఈ కాలనీలో తాగునీటి కోసం చేతిపంపులను ఆశ్రయించాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. తాగునీటి పథకం మరమ్మతులకు గురైన విషయం అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


చేతిపంపు వద్ద తాగునీటి కోసం మహిళల నిరీక్షణ

ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు

సీతారామపురం: గ్రామీణ ప్రాంతవాసులు ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు స్వప్నారెడ్డి కోరారు. ఆమె మంగళవారం సింగారెడ్డిపల్లి ఎస్సీకాలనీలో 80 మంది రోగులకు బీపీ, షుగరు తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రజల చెంతకే వచ్చి వైద్యసేవలందిస్తున్నందున గ్రామాల్లోని ప్రజలందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధచూపాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ తిరుపాల్‌రెడ్డి, ఏఎన్‌ఎం సుమ, ఎంఎల్‌హెచ్‌పీ వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు స్వప్నారెడ్డి

రోడ్డును కమ్మేసిన ముళ్ల పొదలు

ఆత్మకూరురూరల్: మండలంలోని యర్రబల్లి నుంచి బొటికర్లపాడు, గండ్లవేడు, వెన్నవాడ మీదుగా 67వ నంబరు జాతీయ రహదారిని కలిపే రోడ్డు బాగానే ఉన్నా ఆ రోడ్డుకిరువైపులా దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. ఆత్మకూరు, వింజమూరు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల మధ్య సుమారు 30 గ్రామాల ప్రజలు వివిధ అవసరాల కోసం నిత్యం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. మరీ ముఖ్యంగా ఆయా మండలాల్లోని పొగాకు రైతులు తమ బేళ్లను విక్రయించేందుకు డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రానికి ట్రాక్టర్లలో ఈ మార్గంలోనే తీసుకెళతారు. అయితే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు చాలా అసౌకర్యం కలిగిస్తున్నాయని, అనేక మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని గుర్తించలేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ముళ్ల పొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


యర్రబల్లి సమీపంలో రోడ్డును కమ్మేసిన ముళ్ల పొదలు